భ్రమ - ప్రమ

"సులోచన"

ప్రొద్దు అటుమాసి పోతూండగా ఆఫీసు నుంచి వొస్తున్న జగన్నాధానికి కాలేజీ బజారు మలుపులో పరిచయస్థుడు నారాయణస్వామి ఎదురు పడ్డాడు.

"ఎన్నాళ్ళకు తటస్థ పడ్డాం! కులాసాయేనా?" అన్నాడు జగన్నాధం.

'అవును. మీరు ఎక్కడా వుండటం?'

"రామానాయుడి పేటలో - ఆఫీసుకు కాస్త దగ్గరగా వుంది. అదీ కాకుండా నీళ్ళ వసతీ, గాలి వసతీ, ఇరుగూ- పొరుగూ మంచి వాతావరణమే!"

"ఎక్కడా - హెల్తు ఆఫీసరుగారు ఉండేవీధి లోనా?"

"కాదు. రైల్వేస్టేషనుకుపోయే సందుకు కొంచెం పెదగా వుంటుంది. పెద్దడాబా రెండు భాగాలు. ఒక భాగంలో మేమూ, రెండో భాగంలో సర్వేశ్వరరావుగారని ఒక వుద్యోగి వుంటున్నాడు——"

"సర్వేశ్వరరావా! అక్కడికి చేరాడన్నమాట. ఏ సర్వేశ్వరరావు? వై. సర్వేశ్వరరావేనా?"

"ఏమో! వై. యో యస్. యో నాకు సరిగా తెలీదు. కొంచం లావుగా, ఎఱ్ఱగా, వుంటాడు."

"ఆఁ! ఆఁ! అతనే!"

"నీకు తెలుసా?"

"తెలియకేం!" అని మౌనం దాల్చాడు నారాయణస్వామి. ఆ మౌనంలోని ఆంతర్యం జగన్నాధానికి అర్థంకాలేదు. ఏదో చెప్పేందుకు సంశయిస్తున్నాడని మటుకు గ్రహించాడు. ఆ సంశయించ తగిన విషయాన్ని సమగ్రంగా తెలుసుకొనేందుకు జగన్నాధం మనస్సు అశాంతిలో పడింది. నారాయణస్వామి ప్రక్కముఖంపెట్టి సీరియస్‌గా ఆలోచిస్తోనే వున్నాడు. జగన్నాధం వుక్కిరి బిక్కిరి అవుతున్నాడు.

"అతన్ని గురించి మీ అభిప్రాయమేమిటీ? మంచివాడు కాడా? చెప్పస్వామీ! అట్లా సంశయిస్తావేం? ప్రక్కన వుంటున్నాడు——లోతు పాతుల్ని తెలుసుకుని సంచరించడం మంచిదికాదూ!" జగన్నాధం నొక్కి అన్నాడు.

ఇహ తనకు ఎదురుగుండా చెప్పక తప్పదనే పరిస్థితి ఏర్పడినట్లు - చెప్పేందుకు వుపక్రమించాడు నారాయణస్వామి.

"అతను పైకి బాగాకనిపించినా——ప్రవర్తన మంచిదిగాదు. ఇదివరకు అతను రాజాపేటలో వుండేవాడు. ప్రక్కయింటి యిల్లాల్ని బలాత్కారం చేయబోతే అతన్ని చావ చితుక కొట్టారు. ఓరి పోకిల్లా! అక్కడ నుంచి మకాం మార్చాడని విన్నాను. మీ ఇంటి ప్రక్కన వుంటున్నాడన్నమాట. ఏమైనా అటువంటివాళ్ళు మనబోటివాళ్ల యిండ్లప్రక్కన వుండటం యేమంత శ్రేయస్కరం కాదు."

జగన్నాధానికి వొళ్ళు జివ్వుమంది. అంత నీతిమాలినవాడా సర్వేశ్వరరావు? పైకి ఎంత వినయంగా అగపడతాడు?... తనభార్య వొట్టి అమాయకురాలు! వాడి భార్యతో దీనికి స్నేహం! తను ఉపేక్ష జేస్తే లాభంలేదు... తెలిసిందిగా వాడిరహస్య జీవితం! తను వెంటనే యిల్లు మార్చివేయాలి. తన భార్య అందం మీద వాడు ఏనాడో కన్నువేసి వుంటాడు. పోకిరి వెధవ! తను జాగ్రత్త పడడం మంచిది. తన భార్య అతిలోక సౌందర్యవతి! మొదటి భార్య చనిపోవడంతో తనకీ వజ్రం దొరికింది. కట్నం తీసుకోకుండానే, అందానికి దాసోహం చేసి——పెళ్లి చేసుకున్నాడు. పువ్వుల్లో పెట్టి పూజిస్తో వొస్తున్నాడు.

అటువంటి పోకిరి వాళ్ళను యిళ్ళ ప్రక్కనచేర్చి తను కాపురం చేయలేడు. తను మెల్లగా ఆ ఇంట్లోంచి వెళ్లిపోవడమే ఉత్తమం, అనుకుంటో బాగా చీకటి పడ్డాక జగన్నాథం యింట్లోకి వచ్చాడు. కాని భార్య యింట్లోలేదు. సర్వేశ్వరరావు భార్య సుందరమ్మతో కబుర్లాడుతోంది.

మొగుడనేవాడు పగలల్లా ఆఫీసులో పనిచేసి అలసి సాయంత్రానికి యింటికివస్తే, చిరునవ్వుతో ఆహ్వానించేందుకు భార్య గుమ్మంలో లేకపోతే—ఆ మొగుడనే వాడికి రావాల్సిన కోపంకంటే ఆరోజు జగన్నాథానికి యెక్కువ కోపం వచ్చింది భార్య భ్రమరాంబ మీద. పండిగ ప్రక్కనున్న గ్లాసును ఒక్కతన్ను తన్నాడు. ఆ ఇత్తడి గ్లాసు పెద్ద చప్పుడు చేసింది. ఆ చప్పుడుకు భ్రమరాంబ వచ్చింది.

“ఎక్కడ చచ్చావే! ఎప్పుడూ ఆ ప్రక్కభాగంలో పాతుకు పోతావేం? సిగ్గులేదూ! వాళ్లు మన యింటికి అంత విచ్చల విడిగా రారేం?” అరిచాడు. జగన్నాథం మనస్సులోనున్న అక్కసునంతా వెళ్ళగక్కాలని వుంది.

ఆ రోజు భర్త వింతధోరణి ఆ ముద్దుల భార్యకు అర్థంకావడం లేదు. అయితే ఆమె ఒకటి తలంచింది. ఆఫీసులో మేనేజరు చేత తనభర్త చీవాట్లు తిన్నాడేమో! ఆ కోపం తనమీద ప్రదర్శిస్తున్నాడేమో! అట్లా భావించడం చేతనే ఆమె భర్త కోపాన్ని సహించగలిగింది.

ఆ రాత్రి పడక గదిలో భార్యకు చూచాయగా తెలిపాడు ఇల్లు మారవలసి వొస్తుందని. ఆమె “ఎందుకు?” అని నిగ్గదీసింది. కాని జగన్నాథం కారణం చెప్పలేదు. భ్రమరాంబ బుంగమూతి పెట్టుకొని—మూడు అంకె వేసి పడుకుంటే, జగన్నాథం మనస్సు చివుక్కుమని ఆమె పాదాల దగ్గర ఆలోచిస్తూ కూర్చున్నాడు.

మరునాటినుంచీ జగన్నాథం ప్రక్కభాగంలో ఉంటూన్న సర్వేశ్వరరావును పరిశీలనా దృష్టితో చూడ నారంభించాడు. ఉదయం భార్య వాకిట్లో నీళ్ళుచల్లి—ముగ్గు వేస్తూంటే సర్వేశ్వరరావు అరుగు మీద కూర్చుని ముఖం కడుక్కుంటోన్నట్టు నటిస్తూ ఆమెకేసి చూస్తున్నాడు. వొంగి ముగ్గు వేస్తుంటే ఆమె పైట జారిపోయింది. జగన్నాథానికి మహా చెడ్డ చిరాకు వేసుకొచ్చింది భార్యమీద. జారిపోయిన పైట మళ్ళీ వేసుకోదేం? అంత నిర్లక్ష్యమా? అవతల ఆ సర్వేశ్వరరావుగాడు రెప్ప ఆర్పకుండా పైట లేని వక్షం కేసి చూస్తోంటే...‘ఒసే! నిన్నేనే! పైట వేసుకోవే!’ అని అరుద్దామనుకున్నాడు. అతనిలో అంత ఆవేశం, కోపం, పొంగుకొచ్చాయి. సర్వేశ్వరరావును యీడ్చి చెంపమీద కొట్టాలనిపించింది. వాడి కళ్ళల్లో దబ్బనాలతో పొడవాలనిపించింది. ఇంట్లోకి పిలిచి భార్యను చీవాట్లు వేద్దామనుకున్నాడు. కాని హృదయంలో బాధ పడడం తప్ప ఏమీ చేయలేక పోయాడు జగన్నాథం.

ఎంత అమితంగా డబ్బు వున్నా దాని రక్షణకోసం మానవుని బాధ తప్పనట్లు, భార్య భూలోక సుందరని భ్రమసి మురిసి పోయినా, జగన్నాథానికి ఆమె సౌందర్యంతాలూకు బాధ తప్పలేదు. భార్య అందమైనది కావడం అతనిలో చాల క్రొత్తగుణాలు ఉద్భవించటానికి హేతువైంది. భార్యమీద అతనిలో నిలడిన అమితమైన ప్రేమా, ఆమె అందం మీద అతనికున్న గొప్ప అభిప్రాయం, గర్వం, తృప్తి-అతనిలో సాటి పురుషులమీద ద్వేషాన్ని, అసూయనీ, కోపాన్ని రగిలించాయి.

సర్వేశ్వరరావు మీద జగన్నాథానికి రోజురోజుకీ ద్వేషం పెచ్చుపెరిగి పోతోంది. అతని వేషాలన్నీ కనిపెట్టుతున్నాడు. తన భార్య కోసం అతను ప్రాకులాడుతున్నాడనే విషయాన్ని రూఢిగా తేల్చుకోలేక పోతున్నాడు జగన్నాథం. ఏమైనా జగన్నాథానికి ఆ యింట్లో వుండ మనస్సు వేయటంలేదు. ఒక రోజు భార్యతో ఖచ్చితంగా చెప్పాడు.

“మనం ఈ ఇల్లు మారాలి!”

“ఎందుకు?”

జగన్నాథం గొంతులో వెలక్కాయ అడ్డుపడినంత పనైంది. తన మనస్సులో వున్న కారణం చెబితే భార్య తుస్కారంగా నవ్వదూ! తను చులకన కాదూ! తన అవివేకం బయట పడిపోదూ!

"ఎందుకేమిటి? నాకు ఇక్కడ బావుండలేదు. మనం తక్షణం యిల్లు మారాల్సిందే!"

"నాకు యిక్కడే బాగుంది. నీటి వసతివుంది. గాలి ధారాళంగా వస్తుంది. ఇరుగూ – పొరుగూ వాళ్ళు మంచివాళ్లు."

"మనకు అన్ని వసతులు లభించే యిల్లే అద్దెకు తీసుకుందాం. ఇక్కడ నేను వుండలేను."

"ఏం మీకు ఏం లోటు అగుపడింది? బందర్లో యింత చవుక అద్దెకు ఇన్ని వసతులుగల యిల్లు మనకు చచ్చి గీ పెట్టినా దొరకదు." అన్నది భ్రమరాంబ.

ఆమాట నిజమే! కాని తను సర్వేశ్వరరావుకు దగ్గరగా వుండటం శ్రేయస్కరంకాదు. తను యెప్పుడైనా యింట్లో లేనిసమయంలో తన యింట్లో జొరపడితే! అతని ఇంటికి తనభార్య వెళ్ళినప్పుడు యెవ్వరూ లేని సమయం చూచి యేదేనా చేస్తే–ఆపైన ఏమనుకొని యేమిలాభం? తను వెంటనే యిల్లు మారాలి. తను పరువు ప్రతిష్టల్ని నిల్పుకోవాలంటే వెంటనే ఇల్లు మారటమే వుత్తమం!

"ప్రయత్నించాలిగానీ దొరక్కుండా పోదు. రేపు యీ పాటికి యిల్లు కుదుర్చుకు వస్తాను."

"వొద్దు. ఇక్కడే వుందామండీ!" అని పట్టు పట్టింది భ్రమరాంబ.

సర్వేశ్వరరావు భార్య సుందరమ్మతో ఆమెకు స్నేహం బాగా కలిసింది. పైపెచ్చు భర్త ఆ ఇంటిని కాదని యెందుకు అంటున్నాడో కూడా అర్థం కావడంలేదు.

"నే చెప్పినట్టు విను. మన మంచికోసమే చెబుతున్నాను. ఇక్కడ వుండటం మనకు మంచిది కాదు." అని జగన్నాథం యెంత చెప్పినా భ్రమరాంబ వినలేదు.

రెండు రోజులు ఉపవాసాలు చేసాక భ్రమరాంబ భర్త అభిప్రాయంతో యేకీభవించింది. అప్పుడుగానీ జగన్నాథం హృదయానికి పరిపూర్ణమైన తృప్తి చిక్కలేదు.

జగన్నాథం వారంరోజుల్లోనే ఆ యిల్లు ఖాళీ చేశాడు. సుందరమ్మ యెందుకు ఖాళీ చేస్తున్నారని అడుగగా భ్రమరాంబ–"మాబంధువుల యిల్లు ఒకటి ఖాళీగా వుందట. అందుచేత అక్కడికి వెళుతున్నాం" అని అబద్ధమాడింది. ఎందుచేతనంటే - యిల్లుమారే అసలు కారణం ఆమెకు కూడా తెలియదు కనుక.

జగన్నాథం గొడుగుపేటకు వచ్చాడు. కాని అక్కడ అతనికి చాల అసౌకర్యంగా వుంది. భ్రమరాంబ రోజూ భర్త తెలివితక్కువ తనానికి చీవాట్లు వేస్తూనే వుంటుంది. జగన్నాథం సహిస్తూనే వున్నాడు. కాని అతనికి మనస్సుకు విశ్రాంతిచిక్కింది.

ఒక రోజు సాయంత్రం జగన్నాథం, నారాయణస్వామి పట్టాభి మార్కెట్టులో కలుసుకున్నారు.

"ఇల్లు మారారట. ఎక్కడ వుంటున్నారు?" అన్నాడు నారాయణస్వామి.

"గొడుగుపేటలో. ఏం వసతిగాలేదు. గాలి రాదు. ఇంటిముందు మురుగు. వానకురిస్తే బజార్లో మోకాళ్ల వరకు నీళ్ళు. రామానాయుడి పేటలో హాయిగా వుండేవాళ్ళం. ఆ సర్వేశ్వరరావుకు దడిసి ఇల్లు మారవలసి వచ్చింది."

"ఏం! సర్వేశ్వరరావు చాల వుత్తముడు. ఇదివరలో నేను తలచిన సర్వేశ్వరరావు కాదు. ఇతను యస్. సర్వేశ్వరరావు. ఆ సర్వేశ్వరరావుకు విజయవాడ బదిలీ కావడంతో నాలుగు నెలల క్రితమే వెళ్ళిపోయాడట. మీరు యిది వరకు ఉండిపోయిన ఇంటి ప్రక్క సర్వేశ్వరరావు చాల మంచివాడు. అతని భార్య సుందరమ్మ చాల కలుపుగోలు... మనిషి..." చెప్పుకు పోతున్నాడు నారాయణస్వామి.

"నీ కెట్లా తెలుసు?" అన్నాడు జగన్నాథం అక్కసుకొద్దీ.

"నేను ప్రస్తుతం రామానాయుడి పేటలో మీరు ఖాళీచేసివెళ్ళిన భాగంలో—అంటే సర్వేశ్వరరావుగారి భాగం ప్రక్క భాగంలోనే వుంటున్నాను." అన్నాడు నారాయణస్వామి నవ్వుతూ.

—o—